


వరాలు కురిపించు బాబూ..!

నిధుల కోసం సాగునీటి ప్రాజెక్టుల ఎదురుచూపు


- ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం కోసం నిరీక్షణ
- హెచ్చెల్సీ ఆధునికీకరణపై గంపెడు ఆశలు
- బీటీపీకి కృష్ణా జలాల మళ్లింపు సాకారం కావాలి
- హంద్రీనీవా 36ఎ ప్యాకేజీ కాలువలో నీరు పారాలి
- నేడు నేమకల్లుకు సీఎం చంద్రబాబు
- లక్ష ఎకరాలకు సాగునీరు.. సాకారం అయ్యేనా..!



ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మించే స్థలం



బీటీపీ రిజర్వాయర్



రాయదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. రాయదుర్గం ప్రాంతంపై వరాల జల్లులు కురిపిస్తారని ఆశిస్తున్నారు. అర్ధంతరంగా ఆగిన పనులు ఒక వైపు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులు మరోవైపు మోక్షం కోసం ఎదురు చూస్తున్నాయి. చంద్రబాబు వాటికి నిధులను ఇచ్చి అభివృద్ధికి బాటలు వేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. వలసలకు, కరువుకు చిరునామాగా ఉండే జిల్లాలో.. మారుమూల ప్రాంతం రాయదుర్గం. ఇక్కడ లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. సీఎం పర్యటన అందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. నియోజకవర్గంలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నా.. సాగునీటి ప్రాజెక్టులే కీలక సమస్య. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చేపట్టిన పనులు వైసీపీ ఐదేళ్ల హయాంలో ఒక్క అంగుళం కూడా ముందుకు వెళ్లలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. కూటమి అధికారంలోకి రావడంతో నీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉంతకల్లు కోసం నిరీక్షణ

తుంగభద్ర ఎగువ కాలువకు అనుబంధంగా, సమాంతరంగా బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు వద్ద ఐదు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలనే ప్రతిపాదన పదేళ్ల క్రితం నుంచి ఉంది. టీడీపీ అధికారంలో ఉన్నపుడు రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్ ప్రక్రియను పూర్తి చేశారు. హెచ్ఎల్ఎంసీ, జీబీసీ కింద ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగు చేస్తే.. పంట కోత అయ్యే వరకు టీబీ డ్యాం నుంచి నీరు అవసరమౌతుంది. కానీ అంతకు మునుపే ఆంధ్రా వాటా నీటి కోటా పూర్తి అవుతోంది. పంటలు ఎండిపోయి రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతోంది. జిల్లాలో తాగునీటి అవసరాలకు పీఏబీఆర్ మీదే ఆధారపడుతున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి అందే నీటిని సకాలంలో పీఏబీఆర్ వరకు మళ్లించేందుకు కాలువ ఏ మాత్రం అనుకూలించదు. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి అయితే జిల్లాలో తాగునీటి అవసరాలకు, హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టు పంటలకు నీరు అందుతుంది. రాయదుర్గం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుంది. అందుకే జిల్లాలో ఉంతకల్లు రిజర్వాయర్ అత్యంత ప్రాధాన్య అంశంగా ఉంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. నిధులు కేటాయిస్తే పనులు మొదలౌతాయి.

బీటీపీ పనులు సాగేనా..?

వేదవతి నదిపై నిర్మించిన భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు ఎగువనున్న కర్ణాటకలో కురిసే వర్షాలే ఆధారం. కానీ అక్కడ అక్రమంగా చెక్‌డ్యాంలు, రిజర్వాయర్‌లు నిర్మించారు. దీంతో బీటీపీకి వరదనీరు రావడం లేదు. ఇటీవల చెక్‌డ్యాంలు తెగిపోవడంతో కొంతమేరకు నీరు వస్తోంది. బచావత్ ట్రిబ్యునల్‌లో రెండు టీఎంసీల నీటి కేటాయింపు ఉన్న బీటీపీకి కృష్ణా జలాలను మళ్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 2014-19 మధ్య కాలంలో రూ.946 కోట్లతో టెండర్లు పిలిచారు. పనులకు శ్రీకారం చుట్టారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల చెరువులకు జీవనాధారంగా ఉండే ఈ పనులు వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ఆగిపోయాయి. భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తిస్థాయిలో చేయలేదు. సాగునీరు అందించేందుకు ఎంతో దోహదపడే బీటీపీ ప్రాజెక్టుపై అన్నదాతలు చాలా ఆశలతో ఉన్నారు. ఆగిపోయిన పనులను పునః ప్రారంభిస్తారని నిరీక్షిస్తున్నారు. చంద్రబాబు కూడా దీనిపై రెండుసార్లు స్పష్టమైన హామీ ఇచ్చారు. నిధులను కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో కృష్ణా జలాల తరలింపు పనులు పూర్తి అయి బీటీపీకి నీరు చేరితే.. ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

హెచ్చెల్సీకి నిధులు అందేనా..?

తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఆంధ్ర సరిహద్దులోని 105వ కి.మీ. వద్ద నుంచి 84 కి.మీ. పొడవున కాలువను ఆధునికీకరించే పనులు ముందుకు సాగుతాయని అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం నిధులు మంజూరైనా, కాలువ గట్ల లైనింగ్ పనులను మాత్రమే, అదీ అరకొరగా చేసి వదిలేశారు. ఏటా 25 టీఎంసీలకు పైగా నీరు జిల్లాకు అందించే ఏకైక కాలువ హెచ్చెల్సీ. అటువంటి కాలువపై ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులు, అక్విడక్ట్‌లు ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలో కాలువ కుడి, ఎడమ వైపు ఉన్న గ్రామాలకు రాకపోకలు తెగిపోతున్నాయి. కాలువలో నీటి ప్రవాహం ఉన్నంత వరకు అధికారులకు, రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. గట్లు ఎక్కడ తెగిపోతాయోనని, పైపింగ్‌లు, గండ్లు ఎక్కడ పడతాయో అని ఆందోళన చెందుతుంటారు. ఎంబాక్‌మెంట్ ప్రదేశాల్లో ప్రతి సంవత్సరం పైపింగ్‌లు పడి నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కాలువను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

36ఏ ప్యాకేజీ పనులు పూర్తయ్యేనా..?

హంద్రీనీవా ద్వారా జీడిపల్లి రిజర్వాయర్‌కు అందే జలాలను పేరూరు హగరి కాలువ ద్వారా 36-ఎ ప్యాకేజీ నుంచి తరలించి.. 27 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ పనులు పూర్తి అవుతాయనే ఆశలతో మూడు మండలాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. కణేకల్లు మండలంలోని హనకనహాళ్ వద్ద ప్రారంభమయ్యే మాల్యం డిస్ట్రిబ్యూటరీ కింద 13,467 ఎకరాలు, 7ఆర్ డిస్ట్రిబ్యూటరీ కింద 2584 ఎకరాలు, కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా డి.హీరేహాళ్ మండలానికి సాగునీరు అందించే ప్రతిపాదన ఇందులో ఉంది. వీటికి సాగునీటి కేటాయింపులు కూడా జరిగిపోయాయి. పనులు మాత్రం అర్ధంతరంగా ఆగిపోయాయి. కణేకల్లు, రాయదుర్గం, డి.హీరేహాళ్ మండలాలకు నీరు అందించే 36ఎ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తారనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు. రాయదుర్గం, డి.హీరేహాళ్ మండలాలు తక్కువ వర్షపాతం, సాగునీరు అందని ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. ఈ నేపథ్యంలో 36ఎ ప్యాకేజీ పూర్తి అయితే.. అన్నదాతలకు ఎంతో ఊరట లభిస్తుంది. చంద్రబాబు పర్యటనలో వీటన్నింటిపై వరాల జల్లులు కురుస్తాయని, లక్ష ఎకరాల సాగునీరు అందించే సంకల్పం నెరవేరుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

నేడు చంద్రబాబు రాక

అనంతపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు శనివారం రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. ఆ తరువాత నేమకల్లు గ్రామస్థులతో సమావేశమౌతారు. ఉండవల్లి నుంచి రోడ్డుమార్గాన విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి విమానంలో బళ్లారి జిల్లా జిందాల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నేమకల్లుకు బయలు చేరుకుంటారు. ఎంపిక చేసిన లబ్ధిదారుడి నివాసానికి వెళ్లి పింఛన్ అందజేస్తారు. నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకుని, గ్రామస్థులతో సమావేశమౌతారు.

పటిష్ట బందోబస్తు

రాయదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో శనివారం ఆయన పర్యటించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. హోంగార్డుల నుంచి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. సీఎం భద్రత కోసం రూపొందించిన బందోబస్తు ప్రణాళికను ప్రొజెక్టర్‌పై ప్రదర్శించి, సెక్టార్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. హెలీప్యాడ్, పింఛన్ లబ్ధిదారు ఇల్లు, నేమకల్లు ఆంజనేయస్వామి దేవస్థానం, సభాస్థలి.. ఇలా అన్ని ప్రాంతాలలో విధులను కేటాయించారు. రోప్ పార్టీలు, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ డైవర్షన్, క్లియరెన్స్, పార్కింగ్, చెక్‌పోస్టులు తదితర సెక్టార్ల అధికారులను అప్రమత్తం చేశారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో డ్రోన్లతో నిఘా పెట్టారు. నేమకల్లులో శుక్రవారం డ్రోన్లను ఎగురవేసి ఎస్పీ సమీక్షించారు. కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు.



నేమకల్లులో పర్యటిస్తున్న ఎస్పీ జగదీష్

మనిషివేనా మామా..?

మేనల్లుడిని పొట్టన పెట్టుకున్న అశోక్
కిడ్నాప్ చేయించి.. గొంతు కోసి హత్య
మడకశిర నియోజకవర్గంలో దారుణం



రోదిస్తున్న తల్లి, ఇన్‌సెట్‌లో చేతన్ (ఫైల్)

మడకశిర మండలం ఆమిదాలగొంది జడ్పీ ఉన్నత పాఠశాల. ఇంటర్వెల్ సమయం..! స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు చేతన్..! బడి వద్దకు మేనమామ వచ్చాడు. చూడగానే సంతోషపడ్డాడు ఆ పసివాడు. పరిగెత్తుకు వెళ్లి చేయి పట్టుకుని ఉంటాడు. మేనమామ అంటే తండ్రి తరువాత అంతటివాడు మరి. కానీ ఈ మేనమామ కంసుడికంటే కర్కశంగా వ్యవహరించాడు. నమ్మించి తీసుకువెళ్లి.. గొంతు కోశాడు. గొడవలు ఉంటే.. పెద్దల నడుమ ఉండొచ్చు. కానీ పసివాడు ఏం చేస్తాడు..? మనిషన్నవాడు చేసే పనేనా ఇది..? భర్తకు దూరమై.. పుట్టింటికి చేరిన పుష్పలత.. కొడుకును చూసుకుంటూ బతికేది. ఇంక ఎవరికోసం బతకాలి అని ఆమె గుండె పగిలేలా ఏడ్చారు. ఎవరు ఓదార్చగలరు..?

వివరాలు 7లో..

దందాపై కొనసాగిన విచారణ

ఆధారాలు చూపించిన టీడీపీ నాయకులు



వైసీపీ నాయకుడి దందాపై అధికారులకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి గ్రావెల్‌దందాపై శుక్రవారం విచారణ కొనసాగింది. మైన్స్‌అండ్ జియాలజీ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా వేసిన లేఔట్లలోని అంతర్గత రోడ్లకు గ్రావెల్‌ను ఎంతమేరకు తరలించారని తనిఖీలు చేపట్టారు. స్థానికంగా వైసీపీ నాయకుడు వేసిన లేఔట్లలోని అంతర్గత రోడ్లను అన్నింటిని పరిశీలించారు. అర్జీదారులు, టీడీపీ నాయకులు అక్రమంగా తరలించిన గ్రావెల్ వివరాలను అధికారులకు వివరించారు. గ్రావెల్‌ను ఎంతమేరకు వినియోగించారనేది సర్వే అనంతరం తేలనుంది. తనిఖీలకు వచ్చిన అధికారులు మాట్లాడుతూ గ్రావెల్‌దందాపై పూర్తిస్థాయిలో విచారణ చేసిన అనంతరం నివేదికను తయారుచేస్తామని, దీనిని ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. తనిఖీల్లో మైన్స్‌అండ్ జియాలజీ ఏడీ ఓబులరెడ్డి, విజిలెన్స్ ఏజీ అనిల్‌బాబు, సీఐ జమాల్‌బాషా, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆలయ మాన్యాలను గుర్తించలేని ఎండోమెంట్ అధికారులు

పెద్దపేట ఆంజనేయస్వామి మాన్యంలో గ్రావెల్ పెద్దఎత్తున తరలించడం, దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు విచారణకు వచ్చారు. విచారణ సమయంలో ఆ భూమి ఆలయమాన్యం పరిధిలోనిదేనా అని అడిగిన ప్రశ్నకు ఎండోమెంట్ అధికారి వద్ద సమాధానం లేకపోవడంపై విచారణకు వచ్చిన అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా మీ భూములను మీరు గుర్తించలేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌మిషన్ టవర్ చుట్టూ వాల్ నిర్మించుకోవడానికి పవర్‌గ్రిడ్ అధికారులు అనుమతులు కోరితే దేవాదాయశాఖ అధికారులు స్పందించడం లేదని పవర్‌గ్రిడ్ అధికారులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వాల్‌ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వని ఎండోమెంట్‌శాఖ అధికారులు గ్రావెల్‌ను పెద్దఎత్తున తరలిస్తున్నా ఎందుకు అడ్డుకోలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడూ కొనసాగనున్న విచారణ

గ్రావెల్‌దందాపై శనివారం కూడా విచారణ కొనసాగనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. విచారణలో మైనింగ్, విజిలెన్స్, ఎండోమెంట్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. గ్రావెల్ దందాపై విచారణ ఎప్పటికి పూర్తిచేస్తారు ? నివేదికలు ఎప్పుడు సమర్పిస్తారు ? గ్రావెల్ దందా చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అని స్థానికంగా చర్చ జరుగుతోంది.

అదిరిందయ్యా చంద్రం!

- 60వేల అసెస్మెంట్లలో 20వేలు ఆయన ఖాతాలోకే
- జూనియర్ అసిస్టెంట్‌కు ఆర్ఐ పోస్టట
- బాగా పని చేసిన ముడుపులు !



సమాచార హక్కు చట్టం బోర్డులో ఉన్న పేర్లు 80శాతం ఇతర సీట్లలోనే..

అనంతపురం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలున్నా మరోసారి ఆయనకే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు అప్పగించారు. నగరంలోని 60వేల ఇళ్లల్లో(అసెస్మెంట్లు) ఏకంగా 20వేల వరకు ఆయన ఖాతాలోకి వెళ్లాయి. అందులోనూ మంచి ఆదాయం వచ్చే 1నుంచి5, 11, 19 రెవెన్యు వార్డులున్నాయి. ఇంకేముంది అదిరిందయ్యా చంద్రం అంటున్నారు నగరపాలిక ఉద్యోగులు. రెండు రోజుల కిందట నగర కమిషనర్ నాగరాజు రెవెన్యు విభాగంలో పూర్తి స్థాయిలో మార్పులు చేశారు. రెవెన్యు అధికారి(ఆర్వో) పోస్టులతో పాటు నలుగురు ఆర్ఐ సీట్లలో ఉన్నవారిని మార్చారు. అయితే ఇది వివాదమైంది. అప్పటికే ఆయా పోస్టుల్లో పనిచేసిన వారికి మరోసారి అవే సీట్లు కేటాయించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఇద్దరు కీలకమైన వారి నుంచి రూ.లకారాలు ముట్టినట్లు సమాచారం. కీలకమైన ఓ పోస్టు నుంచి ప్రతి నెలా ఆమ్యామ్యాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. అనంతపురం నగరపాలిక పరిధిలో మొత్తం 60వేల పైచిలుకు ఇళ్లు(అసెస్మెంట్లు) ఉన్నాయి. వాటిలో ఓ కీలక ఆర్ఐకు 20వేలకు పైగా అసెస్మెంట్లు అప్పగించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీంతో ఆయన ఇప్పటికే బాగా కమర్షియల్ ఏరియా ప్రాంతంలో అసెస్మెంట్ల పరిశీలనకు వెళ్లినట్లు తెలిసింది. కాగా ఓ జూనియర్ అసిస్టెంట్‌కు ఆర్ఐ పోస్టు కేటాయించడం ఏంటనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ రూ.రెండు లక్షల లావాదేవీనే వ్యవహారం నడిపినట్లు తెలిసింది. కాగా ఇంతకుముందు నుంచే ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి.

మరీ అంత అధ్వానమా..?

ప్రభుత్వ శాఖల పరిధిలో సమాచార హక్కు చట్టం చాలా కీలకం. కానీ నగరపాలిక అధికారులు అవేమీ పట్టించుకోనట్లు తెలుస్తోంది. మూడు రోజుల కిందట సమాచార హక్కు చట్టం-2005 పేరుతో ఓ బోర్డు ఏర్పాటు చేశారు. రెండు రోజుల కిందట రెవెన్యూ విభాగంలో మార్పులు చేశారు. కానీ బోర్డులో మాత్రం గతంలో ఆయా సీట్లలో ఉన్న వారి పేర్లను అలాగే ఉంచారు. ఇందులో 80శాతం పేర్ల హోదా మారినట్లు తెలిసింది. అది చూసిన వారు ఇంత నిర్లక్ష్యమేంటి..?అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారు ఇంక ఏం సమాచారం ఇస్తారంటున్నారు.

నీ బతుకేమిటో తెలుసు..!

హద్దు మీరితే నాలుక కోస్తా
అనంతకు జేసీ ప్రభాకర్‌రెడ్డి వార్నింగ్



తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. 'ఒరేయ్ తొమ్మిది నంబర్లోడా..! జేసీ దివాకర్‌రెడ్డి పుణ్యమా అని నువ్వు పదవులు అనుభవించావు. ఎట్లబడితే అట్ల మాట్లాడితే ఊరుకునేది లేదు. నువ్వు రూ.24 కోట్లు ఎలా కాజేశావో.. నీ బతుకు ఏమిటో మాకు తెలియదా..?' అని మండిపడ్డారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కాంట్రాక్టర్ నెల నెలా రూ.5.40 లక్షలు తెచ్చి ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. మద్యం దుకాణాల అద్దె పేరిట నెలకు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం నుంచి వసూలు చేశాడని ఆరోపించారు. నేషనల్ హైవే-అనంతపురం అర్బన్ లింకు రోడ్డు పనులను పర్సెంటేజీల కోసం నాశనం చేశారని, రూ.30 కోట్లు సొమ్ము చేసుకున్నదని వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గుత్తి రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నుంచి రూ.6కోట్లు కమీషన్ తీసుకున్నది నిజం కాదా అని నిలదీశారు. అనంతపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అధికారులు ప్రతిరోజూ రూ.5లక్షలు తెచ్చింది వాస్తవం కాదా..? మీ ఇంటివద్ద ఆర్యవైశ్యుల స్థలాన్ని సర్వే చేయడానికి వెళ్లిన అధికారులను బెదిరించి అడ్డుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతిలో 'వలపు వలలు' శీర్షిక వచ్చిన కథనం నీ అనుచరుల నిర్వాకం గురించి కాదా అని నిలదీశారు. అక్రమాల కారణంగా అనంత 23 వేల ఓట్ల తేడాతో ఓడిపోయాడని అన్నారు. తాడిపత్రిలో ఇసుక దోపిడి జరిగితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టుకు వెళ్లి పోరాడింది తానొక్కడినే అని అన్నారు. ముచ్చుకోట వద్ద ఉన్న తమ గనిలోకి టన్నెల్ ద్వారా చొరబడి వేల టన్నుల మెటీరియల్ దొంగిలించి అమ్ముకున్నాడని ఆరోపించారు. వైసీపీ జిల్లాలో అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఎవరూ రాకపోవడంతో అనంతకు ఇచ్చారని ఎద్దేవా చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుణ్యమా అని ఆయనకు టిక్కెట్ వచ్చిందని అన్నారు. 'చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడితే.. నీ ఇంటికి వచ్చి కొట్టి నీ నాలుక కోస్తా. నీకు ఎవరు అడ్డువస్తారు..? నీ శివరామిరెడ్డి ఏమైనా వస్తాడా..? అదీ చూస్తా..! ధర్మవరం, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేలను వెనుక వేసుకొని వస్తున్నావు. ఇలాగే చేస్తే నిన్ను ఊరు విడిపిస్తా' అని హెచ్చరించారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



తాడిపత్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా స్వామివారికి శుక్రవారం లక్ష బిల్వార్చన చేశారు. ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్షబిల్వార్చన చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

న్యూస్‌బాక్స్

విద్యాశాఖలో ఇద్దరు ఏడీల బదిలీ

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లు, డిప్యూటీ డీఈఓలను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం బయటకొచ్చాయి. అనంతపురం జిల్లా డీఈఓ ఆఫీస్‌లో ఏడీగా పనిచేస్తూ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఇన్‌చార్జ్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)గా వ్యవహరిస్తున్న నాగరాజు బదిలీ అయ్యారు. ఆయనకు విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. పెనుకొండ డివిజన్ డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న ఏడీ రంగస్వామిని సైతం బదిలీ చేశారు. ఆయనను చిత్తూరు జిల్లా డీఈఓ కార్యాలయ ఏడీగా నియమించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

అనంతపురం ప్రెస్‌క్లబ్/పుట్టపర్తిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రెండు జిల్లాల మైనార్టీ సంక్షేమశాఖ ఏడీలు రామసుబ్బారెడ్డి, రమణారెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రైస్తవులు(బీసీ-సి), సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ తదితర కేటగిరీల విద్యార్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే వీరందరికీ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన సంస్థలు, అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో ఎంప్యానెల్ చేయడం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో శిక్షణ పొందగోరు వారు, అలాగే శిక్షణ ఇవ్వదలచిన సంస్థలు లేదా అభ్యర్థులు www.apcedmmwd.org పోర్టల్ ద్వారా లేదా విజయవాడలోని మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు ఫోన్: 0866-2970567 సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

దుడ్లు ఖర్చు పెట్టండి

- వాటర్‌షెడ్ నిధులు మార్చిలోపు వినియోగించుకోవాలి
- రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖకుమార్



హంపాపురంలో పనులను పరిశీలిస్తున్న వాటర్‌షెడ్ రాష్ట్ర డైరెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సహజ వనరుల యాజమాన్యం (ఎన్‌ఆర్‌ఎం) కింద జిల్లాకు కేటాయించిన వాటర్‌షెడ్ ప్రాజెక్టు నిధులను వచ్చే మార్చిలోపు వినియోగించుకోవాలని, లేని పక్షంలో వెనక్కు చెల్లించాలని ఏపీ రాష్ట్ర వాటర్‌షెడ్ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్ తెలిపారు. జిల్లాలోని శింగనమల మండలం వెస్ట్ నరసాపురం, రాప్తాడు మండలం హంపాపురం, కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామాల్లో చేపట్టిన వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన రాతికట్టడాలు, ఫాం పాండ్లు, చెక్ డ్యాంలు, కుంటలను సహజ వనరుల యాజమాన్యం కింద కేటాయించిన నిధులతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అమృత్‌సరోవర్, ఎన్‌ఆర్‌ఎం పనులను పరిశీలించారు. ఇటీవల హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయి అవార్డు వచ్చిన నేపథ్యంలో అదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీడీ కృష్ణచైతన్య, ఏపీఓ శ్రీవిద్య, పెద్ద ఈశ్వరయ్య, సిబ్బంది, వాటర్‌షెడ్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గాయకుల ఎంపిక

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని కళాకారులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో నూరేళ్ల నా ఊరు కావ్యం పాడేందుకు అనంతపురంలో డిసెంబరు 1న గాయనీ గాయకులను ఎంపిక చేయనున్నట్లు ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రజా కవి వరంగల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం ప్రెక్ క్లబ్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా గాయనీ, గాయకుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 243 చరణాల గేయ కావ్యాన్ని 243 మంది గాయనీ గాయకులతో ఆలపించేందుకు ఈ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిసున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వాల్మీకి హరి, జూపాక శివ, మహేష్, శీను, డాక్టర్ రామాంజనేయులు, వెంకటరావు, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

రబీపైనే ఆశలు

- విస్తారంగా వేరుశనగ సాగు
- ఖరీఫ్ నష్టాలకు వెరవని రైతన్న



వేరుశనగ పంట

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చింది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో అసలు సాగే చేయలేదు. కనీసం సాగు చేసిన చోట కూడా పెట్టుబడులు రాని పరిస్థితి. అయినా సేద్యంపై మమకారం పోగొట్టుకోని రైతన్న రబీలోనైనా మంచి పంటలు పండిద్దామన్న సాగుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే చాలా మంది విత్తన సాగును ప్రారంభించారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో బోరుబావుల కింద విరివిగా పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

కష్టాల ఖరీఫ్

ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు ముఖం చాటేయడంతో చాలా వరకు పంట తీవ్రంగా దెబ్బతింది. కొన్ని చోట్ల పంట సాగు కాకపోవడంతో భూములు బీళ్లుగా మారాయి. వ్యవసాయ అధికారులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలంలో 35వేలకు ఎకరాలకు గాను 8547 ఎకరాల్లో మాత్రమే పంట సాగైంది. రామగిరిలో 28వేలకు ఆరు వేలు, కనగానపల్లిలో 35వేలకు 14,846 ఎకరాలలో పంట సాగైనట్లు అధికారులు చెబుతున్నారు.

జోరుగా సాగు

రబీ సీజన్ మీద ఆశతో రైతులు నవంబరు ప్రారంభం నుంచే వేరుశనగను సాగుచేస్తున్నారు. సీకేపల్లి మండలంలో ప్రస్తుతానికి 150 హెక్టార్లకు పైగా సాగు అవ్వగా రామగిరిలో 120, కనగానపల్లి 130 హెక్టార్ల వరకు పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. డిసెంబరు 15 వరకు సమయం ఉండటంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకావం ఉందని వారు వెల్లడించారు. వరుస తుఫాన్‌ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా బోర్లలో నీరు సమృద్ధిగా ఉండటంతో వేరుశనగ సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశా



రెండు వారాల కిందట నాలుగు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశా. గత ఖరీఫ్‌లో పంట దెబ్బతిని నష్టపోయా. ఈసారైన పంట దిగుబడి వస్తుందన్న నమ్మకంతో బోరు కింద బావుల కింద పంట సాగుచేశా.

- వెంకటేశ్, రైతు, మేడాపురం, సీకేపల్లి

ఖరీఫ్‌లో నష్టపోయా



ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగపంటను సాగు చేసి నష్టపోయా. బోర్లలో నీరు తక్కువ ఉన్నప్పటికీ వర్షాన్ని నమ్ముకుని వేరుశనగ పంట వేశా. అయితే వర్షాలు రాక, బోర్లలో నీరు లేక పంట దెబ్బతిని నష్టపోయా. ప్రస్తుతం రబీ కింద ఐదెకరాలలో పంటను సాగుచేశా.

- శ్రీనివాసులు, రైతు, మామిళ్లపల్లి, కనగానపల్లి

విత్తనశుద్ధి తప్పనిసరి



రబీలో వేరుశనగ సాగుకు ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పంట సాగులో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. ఎకరా దుక్కిలోకి బస్తా యూరియా, మూడు బస్తాల సూపర్, అర బస్తా పొటాష్‌ను కలిసి వేసుకోవాలి. ఎకరాకు 70 నుంచి 100కిలో విత్తనాన్ని ఇరుసాళ్లుగా విత్తుకోవాలి. మొలకెత్తిన తరువాత 25రోజుల నుంచి 30 రోజుల్లోపు మొదటి స్ప్రే ఒకలీటర్ నీటికి 2 ఎంఎల్ రోగోర్, అసిపేట్‌ను కలిపి పైరుపై పిచికారి చేయాలి. ఇలా పంట వివిధ దశల్లో మెలకువలను పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు. రబీలో పంట సాగుచేసిన రైతులందరూ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

- ఉదయ్‌కుమార్, ఏఓ, సీకేపల్లి

శుద్ధ అబద్ధం

పాఠశాలల్లో నిరుపయోగంగా శుద్ధజల యంత్రాలు

కొన్నింటిలో నేటికీ అమర్చని వైనం



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్



నిరుపయోగంగా వాటర్ ప్యూరిఫయర్

పెద్దవడుగూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. యంత్రాలు నాసిరకంగా ఉండటంతో కొన్ని నెలలు మాత్రమే పని చేశాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు 46 ఉన్నాయి. అందులో 3587మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. తక్కువగా ఉన్న పాఠశాలల్లో వాటర్ ప్యూరిఫైడ్ యంత్రాలను అమర్చారు. బుర్నాకుంట, కోనాపురం గ్రామాల్లో ఎన్నికల కోడ్ కారణంగా బిగించలేదు. యంత్ర పరికరాలు పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు చందాలు వేసుకొని మినరల్‌వాటర్‌ను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. పరికరాలు పనిచేయకపోతే ఎంబీఎంఎం యాప్ ద్వారా ఫిర్యాదుచేస్తే తక్షణమే మరమ్మతులు చేస్తారని గతంలో చెప్పారు. అయితే ప్రధానోపాధ్యాయులు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా స్పందన కరువైంది. ఇదేమిటని వారిని ప్రశ్నిస్తే ప్రభుత్వం మారింది మేము వచ్చి పనులు చేస్తే అందుకు సంబంధించిన బిల్లులు మంజూరు కావని చెప్పడంతో కొందరు ఉపాధ్యాయులు సొంతంగా డబ్బులు వేసుకుని చిన్న, చిన్న మరమ్మతులు చేయించుకుంటున్నారు.

యాప్ ద్వారా లాభం లేదు

నీటిశుద్ధి యంత్రాలు పని చేయకపోతే యాప్‌ద్వారా ఫిర్యాదు చేస్తే మరమ్మతులు చేస్తారని చెప్పారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. దీంతో ఏమి చేయలేక మిన్నుకుండిపోతున్నాం.

- సుధాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు, పెద్దవడుగూరు జడ్పీహెచ్ఎస్

సెంచరీతో మెరిసిన వీరా



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ క్రికెట్ పోటీల్లో ఆంధ్ర జట్టు ఆటగాడు వీరారెడ్డి సెంచరీతో మెరిశాడు. మంగళగిరిలో బీసీసీఐ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం ఆంధ్రా, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన పోటీలో మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా 139పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన 85పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా జట్టులో జిల్లా క్రీడాకారుడు వీరారెడ్డి 106పరుగులు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఆంధ్రా జట్టు 337పరుగులకు ఆలౌటైంది. సెంచరీ వీరుడు వీరారెడ్డిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

పాండిచ్చేరిని పడగొట్టిన తేజస్విని.. చక్రిక



చక్రిక



తేజస్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ అండర్-15 బాలికల జాతీయ క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన చక్రిక, తేజస్విని ప్రతిభ చాటారు. ఒడిశాలోని కటక్‌లో జరుగుతున్న బీసీసీఐ-15 జాతీయస్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో ఆంధ్రా, పాండిచ్చేరి జట్లు తలపడ్డాయి&. ఆంధ్రా జట్టు 26ఓవర్లలో 3వికెట్లకు 124పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన పాండిచ్చేరి 24.2ఓవర్లలో 49పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో జిల్లా బౌలర్లు తేజస్విని 5, చక్రిక రెండు వికెట్లు పడగొట్టారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

రేపు వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం



మాట్లాడుతున్న దేవళ్ల మురళి

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐటీ రోడ్డు సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వడ్డెర్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో వడ్డెర్ల సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వడ్డెర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లికార్జున, కుంచెపు వెంకటేష్, పెద్దమారెప్ప, ఆంజనేయులు, సంగప్ప, రవీంద్ర, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం




పాడిపశువుల షెడ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. జిల్లాలో 1475 షెడ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఉపాధి పథకం జాబ్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సలీంబాషా కోరారు. ఆసక్తి, అర్హతగల జాబ్‌కార్డుదారులు సమీపంలోని ఉపాధి సిబ్బందిని సంప్రదించి డిసెంబరు 26లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వివిధ రకాలు..

ఉపాధి జాబ్‌కార్డు కలిగినవారికి ఐదెకరాల లోపు పొలం ఉండాలి. రెండు పశువులకు రూ.1.13లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85లక్షలు, ఆరు పశువులకు రూ.2.30లక్షలు ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం నిధులు చెల్లిస్తుంది. పౌల్ట్రీ కోళ్లఫారాల నిర్మాణానికి సంబంధించి వంద కోళ్ల ఫారానికి రూ.87వేలు, 200కోళ్ల పెంపకం షెడ్‌కు రూ.1.32లక్షలు చెల్లిస్తుంది. మేకలు, గొర్రెల పెంపకానికి సంబంధించి 20గొర్రెలకు రూ.1.30లక్షలు, 50 గొర్రెలకు రూ.2.30లక్షలు చెల్లిస్తారు. అయితే ఇందులో జాబ్‌కార్డుదారుడైన లబ్ధిదారులు 30శాతం వాటా చెల్లించాల్సి ఉంటుంది.

ఎన్నికల బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు



పోస్టల్ బ్యాలెట్ బాక్సును ఏర్పాటుచేస్తున్న ఏడీఆర్‌ఎం

గుంతకల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం నిర్వహించనున్న ఎన్నికల బ్యాలెట్ బ్యాక్స్‌ను ఏడీఆర్‌ఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం దేశవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఏడీఆర్‌ఎం సుధాకర్ తన చాంబర్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను ఏర్పాటుచేశారు. శుక్రవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ పేపర్లను స్వీకరించి డిసెంబరు 4నుంచి 6 వరకూ సాధారణ పోలింగ్‌ను నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి సీనియర్ డీపీఓ చౌహాన్, మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్, ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీలో కీలక పోస్టులు ఖాళీ

ఇన్‌చార్జిలతో పాలన అంతంతే

అనంతపురం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాలు శాఖ (ఆర్‌అండ్‌బీ) పరిధిలో పలు కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతులు లేకపోవడం, నెలలు తరబడి కీలక ఎస్ఈ పోస్టుకు రెగ్యులర్ ఉద్యోగులను నియమించకపోవడంతో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగుల పనితీరు నానాటికీ తీసికట్టుగా మారింది. ఇన్‌చార్జ్‌ల పాలన ఉండటంతో కొందరు అధికారులు కార్యాలయాలకే రాకుండా సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారి రెగ్యులర్ కాకపోవడంతో కింద స్థాయి ఉద్యోగుల్లో కొందరు లెక్క చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీలో కీలకమైన ఎస్ఈ పోస్టులు సైతం రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో మూడు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా కీలక పోస్టులు ఖాళీగా ఉండటం, అర్హులైన డీఈఈలకు ఈఈగా ఉద్యోగోన్నతులు లేకపోవడం శాఖ పనితీరుపై ప్రభావం చూపుతోంది.

ప్రమోషన్‌ల కోసం ఎదురుచూపులు..

ఏ శాఖలోనైనా ఈఈ పోస్టు అనేది చాలా కీలకం. అంతటి కీలకమైన ఈఈ పోస్టులే ఆర్‌అండ్‌బీలో ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లోనే ఎక్కువగా ఎస్ఈ పోస్టులతో పాటు ఈఈ పోస్టుల్లోను రెగ్యులర్ అధికారులు లేకుండా ఉన్నారు. ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి అర్హులైన డీఈఈలకు ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతి కల్పించడం లేదని బాధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆర్‌అండ్‌బీలో ఆయా కేడర్ల ప్రకారం రెగ్యులర్ అధికారులను నియమించడంతో పాటు అర్హులైన ఈఈలకు ఎస్ఈలుగా, డీఈఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించి, న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం

త్వరలోనే రెగ్యులర్ ఎస్ఈలతో పాటు అర్హులైన ఈఈలకు ఎస్ఈలుగా, డీఈఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించే విధంగా నివేదికను ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కొంత సమస్య ఉన్నమాట వాస్తవమే. అయినప్పటికి ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఇన్‌చార్జిలతో త్వరగా పనులు జరిగేలా చూస్తున్నాం.

-నయీముల్లా, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ



హెలీప్యాడ్, సభాస్థలాన్ని పరిశీలిస్తున్న పయ్యావుల

ఇది పేదల ప్రభుత్వం

- మంత్రి పయ్యావుల కేశవ్

బొమ్మనహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తమది పేదల ప్రభుత్వమని, రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళుతోందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని నేమకల్లు గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ సభ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి నేమకల్లు గ్రామానికి చంద్రబాబు వస్తున్నట్లు తెలిపారు. హంగు ఆర్భాటాలు లేకుండా గ్రామస్థాయిలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పినట్లుగానే మొదటి నెల నుంచే పింఛన్ పెంపు అమలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పాడైన రోడ్లకు కూడా మోక్షం కలిగిందన్నారు. హంద్రీనీవా సమస్య పరిష్కారంపై అధికారులకు ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గంలో బీటీపీ, హెచ్చెల్సీ సమస్య, రోడ్ల అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరిస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కన్వీనర్లు కేశవరెడ్డి, ధనుంజయ, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, అప్పారావు, ముల్లంగి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైలు వంతెన కింద ప్రవహిస్తున్న మురుగునీలో వస్తున్న ద్విచక్ర వాహనదారుడు

రైలు వంతెన కష్టాలు

- బ్రిడ్జి కింద పూడిక మట్టి, మురుగునీటి ప్రవాహం
- వాహనదారులు, పాదచారుల తీవ్ర ఇబ్బందులు



రైలు వంతెన కింద ట్రాఫిక్ జామ్ అవడంతో నిలిచిన ద్విచక్రవాహనదారులు

గుంతకల్లు టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతబావి వీధి సమీపంలో రైలు వంతెన వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిసినా వంతెన కిందకు పెద్దఎత్తున మట్టి కొటుకొస్తోంది. దీనికి తోడు మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ధర్మవరంగేట్ సమీపంలో గుంతబావి వద్ద రైలు వంతెన ఏర్పాటు చేశారు. గతంలో రైలు వంతెన కింద ఆటోలు, ద్విచక్రవాహనాలు, కాలినడక పాదాచారులు వెళ్లేవారు. ప్రస్తుతం ఆటోలు వెళ్లకుండా రోడ్డు మధ్యలో ఇనుప రాడ్‌లను ఏర్పాటు చేశారు. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. పాదచారులు వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి పదినిమిషాలకు ఒకసారి రైలు గేట్ వేయడం వల్ల ద్విచక్రవాహనదారులు గుంతబావి కింద ఉన్న రైలు వంతెన కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఒక్కసారి పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో ఆ దారి గుండా ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు వంతెన కింద ఎప్పుడూ చూసిన మట్టి, మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మురుగు నీరు ద్విచక్ర వాహనదారులమీద పడుతోందని వాపోతున్నారు. అయితే రైలు వంతెన కింద మరమ్మతులు చేసేందుకు తమకు అధికారం లేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని సిమెంట్ నగర్-కృష్ణమ్మ కోన సెక్షన్‌లో, పాణ్యం స్టేషన్ల వద్ద జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా గుంతకల్లు, గుత్తి మీదుగా వెళ్లే నాలుగు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూరి-యశ్వంతపూర్ గరీబ్ రథ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం. 22883)ను డిసెంబరు 6న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22884)ను డిసెంబరు 7న జీన్ స్టేషన్ మీదుగా కాకుండా నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం మీదుగా మళ్లిస్తున్నామన్నారు. అలాగే హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22831) రైలును డిసెంబరు 4, 11 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22832)ను డిసెంబరు 6, 13 తేదీల్లో గుత్తి-జీన్ సెక్షన్ మీదుగా కాకుండా అనంతపురం, గుత్తి ఫోర్ట్, ఎర్రగుంట్ల, నంద్యాల స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.

కోమటికుంట్లలో హైటెన్షన్


పెద్దారెడ్డితో మాట్లాడుతున్న ఎస్ఐ హేమాద్రి


తోట వద్ద గుమిగూడిన పెద్దారెడ్డి అనుచరులు

గ్రామానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాక
జేసీపీఆర్ కూడా వెళుతున్నారని సోషల్ మీడియాలో వైరల్
అప్రమత్తమై.. పెద్దారెడ్డిని వెనక్కి పంపిన పోలీసులు

పుట్లూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో శుక్రవారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన తోటకు రావడంతో విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కోమటికుంట్లకు భారీ అనుచరగణంతో వస్తున్నాడని సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఇరువురు నాయకులు ఎదురెదురు తలపడితే ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడ్డారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలతో ఎస్ఐ హేమాద్రి సిబ్బందితో కలిసి హుటాహుటినా కోమటికుంట్లలోని పెద్దారెడ్డి తోటకు వెళ్లారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని ఇక్కడి నుంచి వెళ్లాలని పెద్దారెడ్డిని కోరారు. దీంతో 'నా తోటలో నేను ఉన్నాను. నేను ఏమైనా తాడిపత్రి నియోజకవర్గానికి వెళ్లానా?' అంటూ మాజీ ఎమ్మెల్యే పోలీసులను ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. దీంతో పోలీసులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొద్దిసేపటి తర్వాత పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తప్పనిసరిగా వెళ్లాలని చెప్పడంతో భోజనం చేసి వెళ్లిపోయారు. పెద్దారెడ్డి వెళ్లిపోవడంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తోటవద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. యల్లనూరు మండలం తిమ్మంపల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, కార్లలో పెద్దఎత్తున తోటకు చేరుకున్నారు. పోలీసులు అందరిని అక్కడి నుంచి పంపించివేశారు. అలాగే పెద్దారెడ్డిని, ఆయన అనుచరుల వాహనాలను మండల శివారులోని గరుగుచింతలపల్లి వద్దకు వెళ్లి పంపించి వేశారు.

డీఎస్పీ ఆరా

కోమటికుంట్లలోని పెద్దారెడ్డి తోట వద్ద పరిస్థితిని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సీఐ సత్యబాబు ఎప్పటికప్పుడు ఫోన్‌ద్వారా ఎస్ఐ హేమాద్రితో ఆరాతీశారు. తాడిపత్రి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా పుట్లూరులో వాహనాలను తనిఖీచేసి పంపాలని ఆదేశించినట్లు తెలిసింది. ఎవరూ రాకుండా నిలిపివేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

బాలికపై అత్యాచారం.. జీవిత ఖైదు

అనంతపురం క్రైం/పుట్లూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి జీవితఖైదు విధిస్తూ అనంతపురం పోక్సో ట్రైల్ కేసుల కోర్టు న్యాయాధికారి రాజ్య లక్ష్మి తీర్పు ఇచ్చారు. పుట్లూరులో 2020 జూలై 3న భార్యాభర్తలు కూలిపనికి వెళ్లడంతో వారి ఆరేళ్ల కుమార్తె ఇంటి ముందు ఆడుకుంటోంది. తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడు అనే వ్యక్తి బాలికకు చాక్లెట్ ఇస్తానని నమ్మించి, తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి పుట్లూరు ఎస్ఐ వెంకట ప్రసాద్ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీస్ అధికారులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతపురం పోక్సో ట్రైల్ కేసుల కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10.5లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ వాదించారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌లో శుక్రవారం కిలో సరాసరి ధర రూ. 26, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

పని చేయకపోయినా జీతం

నాలుగేళ్లుగా విధులకు రాని ఏబీపీఎం
బ్యాగుల సరఫరా నిలిచిపోవడంతో అనుమానం
ఎస్‌ఓ పోస్ట్‌మాస్టర్ విచారణలో బట్టబయలు
సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఉద్యోగి
అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
ముద్దనాయనపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో వ్యవహారం



ప్రధాన తపాలా కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): తపాలశాఖలో విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగి ఒక జీతం సరిపోదనుకున్నాడే ఏమోగానీ, రెండుచోట్ల ఉద్యోగాలు చేస్తూ జీతం డ్రా చేస్తున్నాడు. నాలుగేళ్లుగా ఆ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న పోస్టాఫీసు నుంచే నెలనెలా జీతాలు డ్రా చేస్తున్నాడు. ఇవన్నీ ఆ శాఖలోని అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో మిన్నకుండిపోయారు. కళ్యాణదుర్గం డివిజన్‌లోని నూతిమడుగు ఎస్‌ఓ పరిధిలో ఉన్న ముద్దనాయనపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో నాలుగేళ్ల కిందట చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిని ఆ శాఖ ఉద్యోగులు కొందరు మెరిట్ ఆధారంగా ఏబీపీఎం పోస్టు కింద ఉద్యోగం కల్పించారు. అయితే ఆ వ్యక్తి అప్పటికే హైదరాబాదులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయినా అప్పట్లో కొందరు అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఆ వ్యక్తికి ఉద్యోగబాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. అయితే ఆ ఉద్యోగి నెల కూడా సరిగ్గా విధులు నిర్వర్తించనట్లు ఆ శాఖ వర్గాలే పేర్కొంటున్నాయి. ఆ బీఓ పరిధిలోని అధికారులను మేనేజ్ చేసుకుంటూ నెలనెలా రూ. 17వేలకుపైగా జీతం డ్రా చేస్తూ వస్తున్నాడు. వచ్చిన జీతంలో ఆ బీఓలో మేనేజ్ చేస్తున్న అధికారులకు పర్సంటేజీల ప్రకారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా ఆ డివిజన్‌ను పర్యవేక్షించే ఐపీఓస్థాయి అధికారులు, ఉన్నతస్థాయి అధికారులకు తెలిసినా ముడుపుల మత్తులో మిన్నకుండిపోయారనే విమర్శలు వినవస్తున్నాయి. ఈవిషయంపై ఆ శాఖలోని అధికారులకు నూతిమడుగు పోస్ట్‌మాస్టర్ ఫిర్యాదు చేసి రెండు నెలలవుతున్నా చర్యలు తీసుకోవడంలో ఆ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వెలుగులోకి వచ్చిందిలా...

నాలుగేళ్లుగా ముద్దనాయనపల్లి బీఓలో అప్పనంగా జీతం డ్రా చేస్తున్న ఆ ఉద్యోగి చేయాల్సిన విధులు పెండింగ్‌లో పడిపోయాయి. దీంతో ఆ బీఓను పర్యవేక్షించే నూతిమడుగు ఎస్‌ఓ పోస్ట్‌మాస్టర్‌కు అనుమానం కలిగింది. అసలు ఎస్‌ఓ నుంచి బీఓకు వెళ్లాల్సిన బ్యాగులు, బీఓ నుంచి ఎస్‌ఓకు రావాల్సిన బ్యాగులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని, ఏబీపీఎం ఎక్కడున్నాడు..? ఏం చేస్తున్నాడని ఆరాతీస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ పోస్ట్‌మాస్టర్ విచారణ చేయగా నాలుగేళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉందని, అయినా నెలనెలా జీతం డ్రా చేస్తున్నట్లు తెలిసింది. ఆయన జరిగిన విషయాన్ని డివిజన్ అధికారులతో పాటు... ఆ శాఖ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు.

అంతా వాస్తవమే: అబ్దుల్ ఘని, నూతిమడుగు పోస్ట్‌మాస్టర్



ముద్దనాయనపల్లి బీఓలో ఏబీపీఎం పోస్టులో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి నాలుగేళ్లుగా విధులు నిర్వర్తించడం లేదు. అయినప్పటికీ శాలరీ డ్రా చేస్తున్న విషయం వాస్తవమే. రెండు నెలల నుంచి జీతాన్ని నిలిపేశాం. ఇదే విషయంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా. ఆ ఫిర్యాదు ప్రాసెస్‌లో ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఏవైనా ఆదేశాలందితే చర్యలు తప్పవు.

రైతును బలిగొన్న అప్పులు


గొల్ల మంజునాథ్ (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కురాకులపల్లికి చెందిన రైతు గొల్ల మంజునాథ్ (40) అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... మంజునాథకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో టమోటా, మిరప, వేరుశనగ పంటలను సాగుచేశాడు. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో సుమారు 11 బోర్లు వేశాడు. ఒక్క బోరులో మాత్రమే రెండున్నర ఇంచుల వరకు నీరు వచ్చేది. ఆ నీటితోనే ఐదు ఎకరాల వరకు పంటలను సాగు చేశాడు. ఈ మధ్యకాలంలోనే అప్పు చేసి ట్రాక్టర్ కూడా తీసుకువచ్చాడు. బయటి వ్యక్తులతో సుమారు రూ.12లక్షలు, ట్రాక్టర్ కోసం బ్యాంకులో రూ.ఏడు లక్షలు, క్రాప్‌లోన్ రూ. రెండు లక్షల వరకు అప్పులు ఉన్నట్లు వారు తెలిపారు. ఈక్రమంలోనే టమోటాకు తెగుళ్లు వ్యాపించి పూర్తిగా నష్టపోయాడు. పంటల సాగుకు, కుటుంబ జీవనానికి చేసిన అప్పులు కుప్పయ్యాయి. దీంతో వీటిని ఎలా తీర్చేదంటూ ప్రతి రోజు భార్య శారద వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈక్రమంలోనే అప్పులు తీర్చే మార్గం కానరక, జీవితంపై విరక్తి చెందాడు. భార్యకు చెప్పి తోట వద్దకు వెళ్లాడు. అక్కడే పురుగుల మందు తాగి, ద్విచక్రవాహనంలో ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. గమనించిన భార్య గట్టిగా కేకలు వేస్తూ అపస్మారక స్థితిలో ఉన్న భర్త మంజునాథ్‌ను బంధువుల సాయంతో కర్ణాటకలోని బీకేహళ్లికు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పావగడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించినట్లు తెలపడంతో హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శారద, ఐదేళ్ల కుమారుడు దినేష్, మూడున్నరేళ్ల కూతురు వేదశ్రీ ఉన్నారు.

మైనార్టీల సమస్యలను పరిష్కరించండి

● ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు టీడీపీ నాయకుల వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మైనార్టీ సమస్యలను పరిష్కరించాలని జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు ప్రభుత్వ మైనార్టీ ప్రధాన సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని సచివాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఏ షరీఫ్‌ను మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు తాజుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలో మైనార్టీ విద్యార్థులకు గురుకుల పాఠశాల కలగా మారిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గతంలో వచ్చిన నిధులువెనక్కు వెళ్లిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో మైనార్టీ గురుకుల పాఠశాలను నిర్మించి మైనార్టీ విద్యార్థులకు మంచి విద్యనందించాలని కోరారు. ఎంఏ షరీఫ్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు గన్నె రఘు హర్షవర్ధన్‌రెడ్డి, కొండూరి పప్పూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతపురం సెంట్రల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్ష కేంద్రాలను కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తనిఖీ చేశారు. కదిరిలోని పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈ లోకేష్ మాట్లాడుతూ వర్సిటీ నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షల ప్రారంభ సమయానికి ఆన్సర్‌షీట్, క్వశ్చన్ పేపర్లు అందజేయాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థులు వారి భవిష్యత్తును కోల్పోతారని హెచ్చరించారు.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ లోకేష్

అయ్యో.. దేవుడా..

బాలుడి దారుణ హత్య
కన్నీరుమున్నీరైన తల్లి
ఇక.. ఎవరి కోసం బతకాలంటూ గుండెలు బాదుకున్న వైనం


కర్ణాటకలోని పావగడ సమీపంలో బాలుడి మృతదేహం


చేతన్ (ఫైల్)

మడకశిర/మడకశిర టౌన్/రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా వరుసకు మేనమామ.. ఓ పసివాడిని పొట్టన పెట్టుకున్నాడు. మడకశిర మండలంలోని ఆమిదాల గొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చేతన్(13)ను గురువారం కిడ్నాప్ చేసి, దారుణంగా హత్య చేశారు. కర్ణాటకలోని పావగడ తాలూకా రాజవంతి సమీపంలోని అటవీ ప్రాంతంలో గొంతుకోసి, చంపేశారు. ఈ కేసులో అనుమానితుడు అశోక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్పీ రత్న తెలిపారు.

పాఠశాల నుంచి కిడ్నాప్

మడకశిర మండలం మరువపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, పుష్పలత దంపతులు విభేదాల కారణంగా పన్నెండేళ్ల క్రితం విడిపోయారు. విడాకులు తీసుకున్న తరువాత కుమారుడు చేతన్‌తో కలిసి పుష్పలత అదే గ్రామంలోని పుట్టింట్లో ఉంటోంది. ఆ ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమిదాలగొంది జడ్పీ ఉన్నత పాఠశాలలో చేతన్ చదువుతున్నాడు. వెంకటేశ్వర్లు రెండో వివాహం చేసుకున్నాడు. పుష్పలత కియ పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ కుమారుడిని పోషిస్తోంది. ఈ క్రమంలో చేతన్ తాత శ్రీరామప్పకు గురువారం మధ్యాహ్నం ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'నీ మనవడిని కిడ్నాప్ చేశాం.. బడిలో ఉన్నాడో.. లేదో చూసుకుని.. ఫోన్ చెయ్..' అని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో కంగారుపడిన శ్రీరామప్ప వెంటనే పాఠశాలకు వెళ్లి చూశాడు. మనవడు అక్కడ లేకపోవడంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆరాతీశాడు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై తీసుకెళ్లారని తెలియడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీరామప్పకు వచ్చిన ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆ నంబర్ ఓ మహిళది అని తెలుసుకుని ఆమెను స్టేషన్‌కు రప్పించారు. చేతన్‌ను వాళ్ల మామ తీసుకెళ్లాడని తోటి విద్యార్థులు చెప్పడంతో అశోక్‌ను అనుమానించి, అదుపులోకి తీసుకున్నారు. తన ఫోన్ ఇప్పించుకుని, ఎవరికో కాల్ చేసిన అశోక్‌ను ఆ మహిళ గుర్తించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో చేతన్‌ను హత్య చేసింది తానే అని అశోక్ అంగీకరించినట్లు సమాచారం. చేతన్‌ను పాఠశాల వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌లో తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల పుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. వారు కిరాయి హంతకులా, అశోక్ స్నేహితులా అన్నది తేలాల్సి ఉంది.


విలపిస్తున్న చేతన్ తాత, బంధువులు

ఎవరీ అశోక్..?

పుష్పలత తల్లి గంగమ్మకు ఓ సోదరి ఉంది. ఆమె కొడుకే అశోక్. పుష్పలతకు తమ్ముడి వరుస, చేతన్‌కు మేనమామ వరుస. పుష్పలత పుట్టింట్లో ఉంటోంది. ఆమెకు భర్త నుంచి భరణం రూపంలో మూడు ఎకరాల పొలం వచ్చినట్లు సమాచారం. దీంతో పాటు నెలకు రూ.3వేలు ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు పుష్పలతకు మరికొన్ని ఆస్తులు ఉన్నాయనీ, వాటి విషయంలో విభేదాలున్నట్లు తెలిసింది. భర్తకు దూరమైన పుష్పలతకు చేతన్ ఒక్కడే వారసుడు. చేతన్‌ను తప్పిస్తే.. ఆస్తి మొత్తం దక్కుతుందని భావించి.. అశోక్ కిడ్నాప్ నాటకం ఆడి ఉంటాడన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ కేసును ఎస్పీ రత్న స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దర్యాప్తును వేగవంతం చేశారు. బాలుడిని హత్య చేసిన ప్రదేశాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర అర్బన్ సీఐ రామయ్య, రూరల్ సీఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

టెక్నికల్ ఎవిడెన్స్‌తో గుర్తించాం: ఎస్పీ

చేతన్ తాత శ్రీరామప్పకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా టెక్నికల్ ఎవిడెన్స్‌తో బాలుడి మృతదేహాన్ని గుర్తించామని ఎస్పీ రత్న తెలిపారు. చేతన్‌ను గొంతుకోసి హత్య చేసి, పావగడ సమీపంలోని పులికొండ తండా రైల్వే బ్రిడ్జి వద్ద పడేశారన్నారు. అశోక్‌పై అనుమానం ఉందని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారించి, హంతకులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

గుండె పగిలిన తల్లి..

భర్త నుంచి విడిపోయిన పుష్పలత.. కొడుకును చూసుకుంటూ జీవిస్తోంది. ఒక్కగానొక్క కుమారుడిని హత్య చేయడంతో ఆమె గుండె పగిలేలా రోదించింది. మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఇక.. ఎవరికోసం బతకాలి అంటూ గుండెలు బాదుకుంది. తాత శ్రీరామప్ప, అవ్వ గంగమ్మ కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి హత్యతో గ్రామంలో విషాదం అలుముకుంది. బాలుడి మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్థులు, ఆమిదాలగొంది పాఠశాల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చేతన్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం చేతన్ మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. చేతన్ కిడ్నాప్, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వాటికి పాల్పడాలంటేనే భయపడేలా నిందితులకు శిక్ష పడాలన్నారు. బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందనీ, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

చీనీ టన్ను రూ.27 వేలు



అనంతపురం రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27,280 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.12,300, సరాసరి రూ.21,400తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 55 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైసీపీ కార్యకర్తపై దాడి

పెద్దవడుగూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన వైసీపీ కార్యకర్త బీమునిపల్లి రామచంద్రారెడ్డిపై చిన్నవడుగూరు గ్రామానికి చెందిన చిరంజీవిరెడ్డి, చిరంజీవితోపాటు మరో నలుగురు దాడిచేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన మేరకు మండలకేంద్రం సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతుండగా తనపై హఠాత్తుగా దాడిచేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో హెచ్చెల్సీ కెనాల్‌కు సమృద్ధిగా నీరు వచ్చిందని, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అపరభగీరథుడని కీర్తిస్తూ, జేసీ సోదరులపై అనుచిత వ్యాఖ్యలతో అప్పట్లో ఫ్లెక్సీని రామచంద్రారెడ్డి ఏర్పాటు చేశాడు. ఈక్రమంలోనే ఈ సంఘటన జరిగినట్లు సమాచారం.

ఐదుగురు డీసీలకు పోస్టింగ్

అనంతపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదుగురు డిప్యూటీ కలెక్టర్ల(డీసీ)కు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పెద్దఎత్తున డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో అనంతపురం జిల్లాకు ఐదుగురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంత జిల్లాకు కేమల్లికార్జునను హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్(ఎల్‌ఏ)కు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా రామకృష్ణారెడ్డిని, అనంతజిల్లా కోనేరు రంగారావు కమిటీకి తిప్పేనాయక్‌ను, జిల్లా ఆస్పత్రి బయోమెడికల్ డిస్పోజస్ విభాగానికి మల్లికార్జునరెడ్డిని, హెచ్‌ఎల్‌సీ(ఎల్‌ఏ)కు జీవీ సుబ్బారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. వీరందరు ఇప్పటివరకు పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న విషయం విదితమే.

రేయ్.. నీ అంతు చూస్తా

వైసీపీ వర్గీయుడి వీరంగం
సీసీరోడ్డు పనుల అడ్డగింత
ప్రశ్నించిన టీడీపీ ఎస్సీసెల్ నాయకుడిపై దాడికి యత్నం
కులం పేరుతో దూషించాడంటూ పోలీసులకు ఫిర్యాదు


పనులను అడ్డుకుంటున్న వైసీపీ వర్గీయుడు (వృత్తంలో)

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'రేయ్ ఈ స్థలం నాది. ఇక్కడ సీసీరోడ్డు వేయడానికి వీలు లేదు. వెంటనే పనులు ఆపేసి మర్యాదగా వెళ్లిపో. లేదంటే నీ అంతు చూస్తా' అంటూ వైసీపీ వర్గీయుడు టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు శివపై విరుచుకు పడ్డాడు. అభివృద్ధి పనులు చేస్తుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించిన శివను కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించాడు. ఈ సంఘటన చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం జరిగింది. స్థానికంగా పెనుకొండకు వెళ్లే రోడ్డు పక్కన శివ గతవారం రోజులనుంచి సీసీరోడ్డు నిర్మాణ పనులను చేయిస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక వైసీపీ వర్గీయుడైన జీ.ఓబిరెడ్డి అలియాస్ ఓబుళపతి అక్కడికి వచ్చి పనులను ఆపమని హుకుం జారీ చేశాడు. ఎందుకు అని శివ ప్రశ్నించగా ఈ స్థలం నాది, నీవు ఇక్కడ రోడ్డు వేయాల్సిన అవసరం లేదు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోతే బాగుంటుంది. లేదంటే మీ సంగతి తేలుస్తా అని దురుసుగా వ్యవహరించాడు. వంక స్థలాన్ని నాదని అడ్డుకోవడం ఎంతవరకు సబబని టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు ఓబిరెడ్డిని ప్రశ్నించాడు. ఈ మాటలు వినిపించుకోకుండా తనను కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించాడని శివ ఆరోపించాడు. ముందు వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని అప్పుడు మీ భరతం పడతామని బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా ఈ విషయాన్ని కవరేజ్ చేయడానికి వెళ్లిన విలేకరులపై సైతం చిందులు తొక్కాడు. చివరికి బాధితుడు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వైసీపీ వర్గీయులు ఇలా దాడులకు తెగ బడుతున్నారని టీడీపీ నాయకులు అంకే అమరేంద్ర, యజ్ఞే శంకర్, ముత్యాలప్ప, అమరేంద్రరెడ్డి తదితరులు విమర్శించారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

గుంతల రోడ్లకు మహర్దశ

నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభమైన మరూరు-పాలబావి రోడ్డు పనులు

రాప్తాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు నిర్లక్ష్యాని గురయ్యాయి. కొన్నింటికి నిధులు మంజూరైనా ప్రజా ప్రతినిధులు తారురోడ్లు వేయలేకపోయారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తారు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మరూరు 44వ జాతీయ రహదారి వద్ద నుంచి చాపట్ల గ్రామానికి 3 కి.మీ తారు రోడ్డు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయి. అలాగే మరూరు 44వ జాతీయ రహదారి వద్ద నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ ఆలయం వరకు తారు రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూరయ్యాయి. శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రోడ్డు పనులు నిలిపివేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మించలేకపోయారు. 2024 ఎన్నికల ప్రచారంలో పరిటాల సునీత చాపట్ల, ఎం చెర్లోపల్లి, పాలబావి గ్రామాలకు తారురోడ్డు నిర్మిస్తామనని బహిరంగ సభలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత పీఆర్ నిధులు మంజూరు చేయించారు. మరూరు నుంచి చాపట్లకు 3 కి.మీ, తారురోడ్డు నిర్మాణానికి రూ. 1.59 కోట్లు, మరూరు నుంచి ఎం. చెర్లోపల్లి, పాలబావి మీదుగా మారెమ్మ ఆలయం వరకు 8 కి.మీ తారు రోడ్డు నిర్మాణానికి రూ.4.90 కోట్లు నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా మట్టి వేసి చదును చేశారు. మరో వారం రోజుల్లో తారు వేయనున్నారు. గ్రామాలకు తారురోడ్డు నిర్మిస్తున్నారని వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకి ఆయా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గత ఐదేళ్లలో రోడ్డు వేయలేదు



మరూరు నుంచి చాపట్ల గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరయ్యాయి. అయితే వైసీపీ ప్రజా ప్రతినిధులు ఐదేళ్లలో తారు రోడ్డు వేయలేకపోయారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల హామీ ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడం అభినందనీయం.

- కుమార్, చాపట్ల

ఇబ్బంది పడ్డారు..



మరూరు నుంచి ఎం చెర్లోపల్లి, పాలబావి గ్రామాలకు రోడ్డు సక్రమంగా లేదు. గుంతల రోడ్డులో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించింది. దీంతో ఎం చెర్లోపల్లి, పాలబావి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-సూరి, మరూరు

ఓటేయలేదని పట్టించుకోలేదు

● వైసీపీ పాలనపై ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శ



ఆజాద్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఓటు వేయలేదన్న కారణంతో 40వ డివిజన్‌పై కక్షకట్టి గత నాలుగేళ్లల్లో ఒక్క పని కూడా చేయలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. మీఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుతో కలిసి 40వ డివిజన్‌లోని ఆజాద్ నగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, ఇళ్ల పట్టాలు, తాగునీటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నగరపాలిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి శ్రీలక్ష్మిని గెలిపించడంతో గత పాలకులు ఈ డివిజన్ ప్రజల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు సహకారంతో ఇళ్ల పట్టాలతో పాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, మధు రాయల్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వరన్, స్వప్న, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవాని, సాలార్ బాషా, సరిపూటి రమణ, రాజారావు, రమేష్, నెట్టెం బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాగునీటికి కష్టాలు: ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నగర ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. కూడేరు మండలం ముద్దలాపురం వాటర్ ప్లాంట్ వద్ద 16 ఎంఎల్‌డీ ప్లాంట్ ట్రయల్ రన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్లాంట్ నిర్మాణ పనులు, నీటి శుద్ధి తదితర అంశాలను పరిశీలించారు. నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో సీఎం చంద్ర బాబు స్పందించి 2017లో రూ.16 కోట్లతో 16 ఎంఎల్‌డీ ప్లాంట్‌ను మంజూరు చేశారని గుర్తుచేశారు. గత ఐదేళ్లల్లో ఈ పనులు ముందుకు సాగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్లాంట్‌పనులు పూర్తి చేసిందన్నారు. ప్రస్తుతం 23 డివిజన్లకు ప్రతి రోజు తాగునీరు అందుతోందని, మరో 27 డివిజన్లకు రోజుమార్చి రోజు అందుతోందన్నారు. ఇక నుంచి ప్రతిరోజు అన్ని డివిజన్‌లకు తాగునీరు వస్తుందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా అనంత అర్బన్‌తోపాటు నారాయణపురం పంచాయతీ ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు. నిరంతరాయంగా సాగు నీరు అందిస్తామన్నారు. నగర కమిషనర్ నాగరాజు, ఇంజనీరింగ్ అధికారులు నరసింహ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

అర్బన్‌కు చెందిన ఐదుగురికి రూ.8.28 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అందజేశారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో శుక్రవారం ఆ కుటుంబాల వారికి చెక్కులు అందజేశారు.

కార్మికులకు పనిముట్లు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నగర పాలక సంస్థ కార్మికులకు పనిముట్లు అందాయి. ఇటీవల ఎమ్మెల్యే నగర పాలక కార్యాలయానికి వెళ్లిన సమయంలో తమకు పనిముట్లు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన చెందారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం కార్మికులకు గంపలు, పరకలు, ఇతర పనిముట్లను అధికారులు అందజేశారు.

వేగవంతంగా వీఎల్ఎస్ఐ టెక్నాలజీ

● ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న వీఎల్ఎస్ఐ టెక్నాలజీతో వృత్తిపరమైన అభివృద్ధిని సాధించవచ్చని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తెలిపారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ మమత ఆధ్వర్యంలో శుక్రవారం సినర్జీ2024 సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకోసం వి-ఉద్భవ్ అనే వీఎల్ఎస్ ఐ క్లబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఆటోమేషన్, మిషన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ తదితర రంగాల్లో వీఎల్ఎస్ఐ ప్రధాన పాత్రపోషిస్తుందని పూర్వపు విద్యార్థి హేమంత్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రమణారెడ్డి, సుమలత, అరుణమస్తాని, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజన్-2024లో భాగస్వాములవ్వాలి

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుస్థిర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు నిర్దేశించిన ఏపీ విజన్-2024 సాకారమయ్యేలా అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఐదురోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ వీసీ విజన్-2024 అంశాలను వివరించారు. విజన్‌కు దోహదపడే అంశాలపై అధ్యాపకులు పరిశోధన చేసి, విద్యార్థులకు బోధించాలని తెలిపారు. టెక్నాలజీని ఒక గేమ్ చేంజర్‌లా సీఎం అమలు చేస్తున్నారని తెలిపారు. శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రొఫెసర్‌లు సుజాత, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల్లో ఫెన్సింగ్‌కు యత్నం

● అడ్డుకున్న అంగన్‌వాడీలు



బంగి భాస్కర్‌తో అంగన్‌వాడీల వాగ్వాదం

అనంతపురంరూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి సమీపాన అంగన్‌వాడీలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఫెన్సింగ్ వేయడానికి కొందరు శుక్రవారం ప్రయత్నించారు. సంబంధిత అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను తహసీల్దార్ వద్దకు వెళ్లి నచ్చచెప్పి పంపివేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు మాట్లాడుతూ... 2004 నుంచి బీఎల్‌ఓలుగా పనిచేస్తున్న 69 మందికి 2011లో ఉప్పరపల్లి సర్వే నంబరు 107-1నుంచి 107-7 వరకు ఒకటిన్నర సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అక్కడ అప్పట్లో అనువుగా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. నాలుగైదేళ్లుగా ఇళ్ల నిర్మాణానికి వెళ్లినపుడల్లా ఎవరో ఒకరు రావడం భూమి తమదంటూ అడ్డుపడుతున్నారని వాపోయారు. కొన్నినెలలుగా బంగి భాస్కర్, అతడి కుటుంబ సభ్యులు ఇదేవిధంగా అడ్డుపడుతున్నారన్నారు. ఈ రోజు కూడా తమ స్థలాల్లో వారు ఫెన్సింగ్ వేస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలసి సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయ, వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సమయపాలన తప్పనిసరి

● ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి బాధ్యతగా వేళలు పాటిస్తూ విధులు నిర్వహించాలని, అలా పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి ఆమె శుక్రవారం విభాగాల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా గురువారం 11 గంటలకు బీఈడీ కళాశాలకు వెళితే.. అక్కడి లైబ్రరీ ఉద్యోగి రఘోత్తమరెడ్డి గదికి తలుపులువేసి బయటకెళ్లాడని అన్నారు. ఎక్కడున్నా రావాలని కబురుపెట్టినా రాలేదన్నారు. వేళకు విధుల్లోలేని రఘోత్తమరెడ్డికి మెమో జారీ చేశామని వీసీ తెలిపారు.

'దివ్యాంగుల కోసం పోరాడుతాం'

అనంతపురం సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు న్యాయం స్థానంలో పోరుడుతామని బహుజన లాయర్స్ ఫోరం (బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది నారాయణప్ప పేర్కొన్నారు. ఆయన శుక్రవారం బాధిత దివ్యాంగులతో కలిసి న్యాయ సేవాధికార సంస్థ ఆవరణంలో మాట్లాడారు. రూరల్ మండలంలోని సోములదొడ్డి గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో దివ్యాంగులు నివా సాలు ఏర్పాటుచేసుకున్నారని, గత వైసీపీ పాలనలో కొంతమంది వారిపై దాడికి యత్నించారన్నారు. అధికార పలుకుబడితో రెవెన్యూ అధికారుల ద్వారా గుడిసెలను తొలగించారన్నారు. సంబంధిత అధికారులతోపాటు దాడికి యత్నించి న వారిపై కేసువేశామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రేవతి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టుపై ఫిర్యాదు

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలలను కించపరుస్తూ సోషల్ మీడియాలో వీడియో పెట్టిన వ్యక్తిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని అయ్యప్ప మాలధారులు శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం అసత్య ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. అయ్యప్ప దీక్షధారుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో మాలధారులు చేపల హరి, ఓంకార్‌రెడ్డి, కడియాల కొండన్న, వరుణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అపహరణ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపల్లి, హరియన్ చెరువు గ్రామాల్లో గురువారం రాత్రి పశువులను అపహరించినట్లు ఆయా గ్రామస్థులు తెలిపారు. చిన్నపల్లిలో మాధవరాజు అనే రైతుకు చెందిన జత కోడెలు, హరియన్ చెరువులో లక్ష్మీనారాయణ అనే రైతుకు చెందిన పాడి ఆవును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వాటి విలువ రూ.1.50 లక్షకుపైగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక





అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి వెంకటనాయుడు

రాప్తాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య తెలిపారు. అనంతపురం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా నారాయణ, అధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటనాయుడు, సహాధ్యక్షులుగా చంద్రారెడ్డి, కవిత, కోశాధికారిగా రాజకుళ్లాయప్ప, కార్యదర్శులుగా సాంబశివుడు, సంజీవకుమార్, గాయత్రి, నబీరసూల్‌ను ఎంపిక చేశామని రమణయ్య తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారికి సూచించామని తెలిపారు.

వ్యవసాయ కార్మిక కమిటీ ఎంపిక

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం కాకుండా కూలీలకు పనులు కల్పించి, గిట్టుబాటు కూలీ ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి టి. నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శింగనమలలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మునిస్వామి, ప్రధాన కార్యదర్శి గా ఓబుళపతి, సహాయకార్యదర్శులుగా రూప్లానాయక్, చితంబరప్పతో పాటు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నప్పయాదవ్, వ్యవసాయ కార్మిక సం ఘం నియోజకవర్గం కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు బీటర్లను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. వేణు గోపాల్‌నగర్ ఆటోస్టాండ్ సమీపంలో మట్కా రాస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నారు.



కేశవ్‌ను కలిసిన అహుడా చైర్మన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను అహుడా చైర్మన్ టీసీ వరుణ్ శుక్రవారం నగరంలోని కేశవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అహుడా అభివృద్ధికి ప్రభుత్వం తరుపున తనవంతు బాధ్యతగా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు టీసీ వరుణ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జనసేన నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, నాయకులు ఉన్నారు.

● ఆత్మకూరు: మండల పరిధిలోని పి సిద్ధరాంపురం నుంచి ఎంఎం హళ్లి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన తారురోడ్డు ప్రారంభోత్సవానికి శుక్రవారం వచ్చిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు.



మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం : ఆర్ఈఎఫ్

అనంతపురం సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ అర్హతతో ఉద్యోగాలు పొందిన శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీలను గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. 2019 సచివాలయ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీ పోస్టులను టెక్నికల్ సర్వీస్‌లో చూపించారని, అయితే విధులు మాత్రం మురుగు కాల్వలు, రోడ్లు ఊడ్చించే పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. సీఎంగా చంద్రబాబు నాయుడు స్పందించి మదర్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలని కోరారు.

సబ్జెక్టు టీచర్లను నియమించండి: ఎస్టీయూ

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్ల స్థానాలను భర్తీ చేయాలని ఎస్టీయూ నాయకులు.. డీఈఓ ప్రసాద్ బాబును కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు శుక్రవారం డీఈఓను కలిశారు. రెండు, మూడు నెలలుగా పలు కారణాల వల్ల తోపుదుర్తి, ఇల్లూరు, రాప్తాడు, శింగనమల, బండ్లపల్లి, నార్పల, వెంకటాద్రిపల్లి, మరూరు, ఖాదర్‌పేట తదితర ప్రాంతాల్లో పలు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఖాళీ స్థానాల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మల్లికార్జున, రామకృష్ణ పాల్గొన్నారు.

అటవీ చట్టాలపై అవగాహన తప్పనిసరి

● సిబ్బందికి స్క్వాడ్ డీఎఫ్ఓ సూచన

అనంతపురం న్యూటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అటవీ చట్టాలపై తగిన అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఆత్మకూరు మండలపరిధిలోని పంపనూరు నగరవనంలో శుక్రవారం జిల్లాలోని అటవీశాఖ సిబ్బందికి అటవీశాఖ చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. స్క్వాడ్ డీఎఫ్ఓ హాజరై సిబ్బందికి పలు అటవీశాఖ చట్టాలపై అవగాహన కల్పించారు. అందులో ప్రధానంగా వన్యప్రాణులు, అటవీశాఖ స్థలాల సంరక్షణకు చేపట్టాల్సిన చట్టాలు. వాటిని అమలు చేయాల్సిన తీరుపై వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రేంజర్ శ్రీనివాసులు, స్క్వాడ్ రేంజర్ చంద్రశేఖర్, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. రాష్ట్ర శింగనమలకు చెందిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. ఆదినారాయణ శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పై విధంగా స్పందించారు. కార్యక్రమంలో తెలుగు యవత మండల అధ్యక్షుడు కాయల సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్‌లో 138మందికి ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఐటీ బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులు 138 మంది ఏకకాలంలో టీసీఎస్ సంస్థ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. వారిని శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ... జాతీయ, అంతర్జాతీయంగా పలుసంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంపికైన 138 మందిలో రూ.9లక్షల వార్షిక వేతనానికి ఇద్దరు, రూ.7లక్షల ప్యాకేజీతో 21మంది, రూ. 3లక్షల వార్షిక వేతనంలో 115మంది ఎంపియ్యారని వివరించారు. వీరిలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఫ్యాకల్టీ కృషి మరువలేనిదని పేర్కొన్నారు.

'లీగ్‌లతో గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు'

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు చక్కని అవకాశాలు కల్పిస్తున్నాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా శుక్రవారం స్థానిక తపోవనం క్రికెట్ గ్రౌండ్స్‌లో అండర్-15 బాలుర రూరల్ క్రికెట్ లీగ్-2024 క్వాలిఫయర్ మ్యాచ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాష్‌రెడ్డి పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అనంతరం నిర్వహించిన మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, మడకశిర జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన తపోవనం క్రికెట్ అకాడమీ 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. తన్మయి కార్తీక్‌రెడ్డి 125పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన మడకశిర 24 ఓవర్లలో 65 పరుగులకు కుప్పకూలింది. టీసీఏ బౌలర్ కుశాల్‌రాయల్ 5 వికెట్లు తీసి 181 పరుగుల తేడాతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, మేనేజర్ సాగర్‌చౌదరి, కోచ్‌లు రవికాంత్, తాహీర్, అశోక్, టీసీఏ చైర్మన్ శివ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాప్తాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాప్తాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు రాప్తాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం సాంబశివ, పీఈటీ కేశవమూర్తి తెలిపారు. అండర్-14 విభాగంలో జోషియా బేగం, ప్రగతి నక్షత్ర, భరత్ కుమార్, వీరేంద్ర, అండర్-17 విభాగంలో లోకరాజు, లోహిత్, లిఖిత, పవిత్ర ఎంపికైనట్లు తెలిపారు. చిత్తూరు, గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రాప్తాడు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తాం

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- ఎంఎం హళ్లిలో బీటీ రోడ్డు ప్రారంభం

కూడేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా ప్రధాన కాలువను వెడల్పు చేస్తామని, అందుకు సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మండలంలోని ఎంఎంహళ్లి గ్రామం నుంచి ఆత్మకూరు మండలం సిద్దలాపురం గ్రామం వరకు దాదాపు రూ. 2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మితమైన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కేశవ్ హాజరయ్యారు. ఎంఎంహళ్లికి మంత్రి రాగానే గ్రామస్థులు, స్థానిక టీడీపీ నాయకులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలుంటే శాశ్వతంగా పరిష్కరిస్తామని, అలాగే ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ అవకాలు కల్పిస్తామన్నారు. ఉరవకొండ నియోజక వర్గ అభివృద్ధికి తాను కూలీగా పని చేస్తానని పేర్కొన్నారు. తర్వాత బీటీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు పూజారి రాజు, దేవేంద్ర, వన్నూరుస్వామి, ఎంపీ అక్కులన్న, టింగ్ అఖిల్, ప్రభాకర్, కొండ, పోతులూరి, ఓబుళపతి, అక్కులన్నతో పాటు తహ సీల్దారు మహబూబ్ బాషా, రీ సర్వే డీటీ దబ్బర ప్రసాద్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, సీఐ రాజు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని సీపీఐ తాలుకా కార్యదర్శి మలికార్జున, కార్మికులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఎంహళ్లి గ్రామంలో వారు మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఉరవకొండ/ కూడేరు: సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని 10 మంది లబ్ధిదారులకు రూ.7.73లక్షలు మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కులను మంత్రి అనంతపురంలోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. అందులో కూడేరు మండలంలోని ఇప్పేరుకు చెందిన ఈడిగ ఆంజనేయులు, జల్లిపల్లికి చెందిన రమేష్, ఉదిరిపికొండకు చెందిన సునీలమ్మ చెక్కులు అందుకున్నారు.

క్లుప్తంగా..

ఘనంగా సత్యనారాయణ వ్రతం


వ్రతంలో పాల్గొన్న భక్తులు

పామిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాతృమండలి సౌజన్యంతో సామూహిక సత్యనారాయణవ్రతం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో గణపతిపూజ, సత్యనారాయణ వ్రతం చేపట్టారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేపట్టారు. వినాయక ఉత్సవసమితి అన్నదానం చేపట్టింది.

ఎఫ్‌సీఐ గోడౌన్ల పరిశీలన

గుంతకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎఫ్‌సీఐ గోడౌన్లలోని సరుకులను ఇండియన్ మినిస్ట్రీ ఆఫ్ కంజ్యూమర్స్ అండ్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ కన్సల్టేటివ్ కమిటీ ఏపీ డైరెక్టర్ వనగొండి విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. గోడౌన్‌లో 18 నెలలుగా నిలిచిపోయిన సరుకుల గురించి గోడౌన్ అధికారులు విజయలక్ష్మికి వివరించారు. వీటి వినియోగానికి సంబంధించి కేంద్రానికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతానని ఆమె వివరించారు.

రూ.1.90 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి

గుత్తి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన మాణిక్య బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో రూ.1.90 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షుడు జీవీ రామన్ పేర్కొన్నారు. తొండపాడులోని మాణిక్య రంగనాథ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే కొండపైకి వెళ్లడానికి మెట్లు, లక్ష్మమ్మ గుడి వద్దకు సీసీ రోడ్డు నిర్మంచామన్నారు. కొండపైన రంగనాథ స్వామి ఆలయంలో గ్రానైట్, గ్రిల్ నిర్మించామన్నారు. పాత సత్రాలకు మరమ్మతులు చేపట్టామన్నారు. కొండపైకి వెళ్లే భక్తుల కోసం మూడు చోట్ల షెల్టర్లును నిర్మించామని తెలిపారు. సమావేశంలో మాణిక్య రంగనాథ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని గోళ్ల ప్రాజెక్టు పరిధిలోని వాటర్ షెడ్ పనులను వాటర్‌షెడ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ కుమార్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులకు ఫారంపండ్, వాటర్‌షెడ్, చెక్‌డ్యామ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. రైతులకు కావలసిన పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వాటర్‌షెడ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, పీడీ కృష్ణచైతన్య, పీవో శ్రీవిద్య, కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లింగమయ్య, మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, రామ్మోహన్ యాదవ్, గోళ్ల రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన

యాడికి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీలో బాలికలకు శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ విజయభాస్కర్ లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎన్నో అనర్థాలకు దారితీస్తాయన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. దీనిని అతిక్రమించిన వారు చట్టరీత్యా శిక్షార్హులు అని తెలిపారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్‌అహ్మద్, కేజీబీవీ ఎస్‌ఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయానికి వెండి వస్తువుల సమర్పణ


వెండి వస్తువులను అందజేస్తున్న భక్తురాలు

గుంతకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి స్థానిక భక్తురాలు జీ. రమాదేవి 2 కిలోల 165 గ్రాముల వెండి వస్తువులను సమర్పించారు. రమాదేవి హనుమద్ వ్రతంలో పూజల కోసం వెండి వస్తువులను వితరణ చేశారు. వెండితో తయారు చేసిన శఠారి, కంచం, రెండు గిన్నెలు, పంచపాత్రలు, రెండు ఉద్ధరిణులను శుక్రవారం ఆమె ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు అజెండాను చదివి వినిపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పాము


ఇదే.. ఆ పాము

శెట్టూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో ఫైళ్ళను భద్రపరిచే బీరువాలో పాము కనిపించింది. దీంతో సిబ్బంది భయాందోళనకి గురయ్యారు. కర్రతో కొట్టి చంపేశారు. గతంలో కూడా ఎంపీడీఓ కార్యాలయంలో పాములు కనిపించాయి. దీంతో సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు భయపడుతున్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే గుమ్మనూరు

గుత్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు పాటుపడుతామన్నారు. ఈ ఆసుపత్రికి చుట్టూ జాతీయ రహదారులతో పాటు ప్రధాన రైల్వే జంక్షన్ ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను అధికంగా ఇక్కడికే తీసుకొస్తారన్నారు. కనుక వారికి ఎమెర్జెన్సీ వైద్య సేవలు అందించేందుకు ట్రామా సెంటర్ తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. 50 పడకల నుంచి 100 పడకలు ఆస్పత్రిగా అభివృద్ధి పరుస్తామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలిని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప ప్రకటించారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కన్వీనర్‌గా వైద్యుడు ఎల్లప్ప, సభ్యులుగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ ప్రభాకర్, మహిళా సమైఖ్య కార్యదర్శి హేమలత, శ్రీనివాసులు, రమేష్, విశ్రాంత వైద్యుడు క్రిష్ణగోపాల్ రెడ్డిని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే బాలింతలకు, గర్భిణులకు పౌష్టిక ఆహారం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, సోదరుడు నారాయణ, టీడీపీ నాయకులు ఎంకే చౌదరి, బర్దివలి, సోమశేఖర్, దిల్‌కా శీనా తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సుంకులమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ బాట సుంకులమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బాట సుంకులమ్మ ఆలయం వద్ద ఆయన ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాట సుంకులమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తొలుత ఆయన సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, వెంకటరాముడు, నరసింహులు, రంగస్వామి, నాయకులు చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామి రెడ్డి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో నైపుణ్యాల పెంపు

యాడికి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పరిశీలనతో విద్యార్థులు నైపుణ్యాల స్థాయిని పెంపొందించుకుంటారని ఒకేషనల్ ట్రైనర్ శిరీష తెలిపారు. శుక్రవారం రాయలచెరువు హైస్కూల్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా షాపింగ్‌మాల్‌ను సందర్శించారు. షాపింగ్‌మాల్‌లో లావాదేవీల నిర్వహణ, స్కానర్‌ల పనితీరు, వస్తువులపై క్యూఆర్‌కోడ్, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు డేనియల్, వృత్తి విద్యా కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, కార్తీక్ పాల్గొన్నారు.

విహారయాత్రకు ప్రత్యేక బస్సులు

రాయదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం లోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, లెక్చరర్లు, టీచర్లకు డిసెంబరు మూడో తేదీన రాత్రి 9 గంటలకు రాయదుర్గం నుంచి శ్రీహరికోట స్పేస్ సెంటర్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్ ధర సూపర్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌కైతే ఒక్కొక్కరికి రూ. 1300, సూపర్ లగ్జరీకి అయితే రూ. 1800లు రాను పోను కలిపి వసూలు చేస్తామన్నారు. ఆసక్తి గల వారు పాఠశాలలు, కళాశాలల రిజిస్ట్రేషన్ నంబర్లు , విద్యార్థుల వివరాలను ఆధార్ జిరాక్స్ కాపీలతో డిపో మేనేజర్‌కు అందించాలన్నారు. ఈ విహారయాత్రలో శ్రీహరికోట స్పేస్ సెంటర్‌తో పాటు పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల విహార కేంద్రం, సుళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయాన్ని చూపిస్తామన్నారు. ముఖ్యంగా డిసెంబరు 4న శ్రీహరికోట స్పేస్ సెంటర్ నుంచి 5.30 గంటలకు ప్రయోగిస్తున్న రాకెట్ లాంచర్‌ను వీక్షించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. మరింత సమాచారం కొరకు 9959225863ను సంప్రదించాలని కోరారు.

జూడో చాంపియన్ ఏవీఆర్ పాఠశాల

ఉరవకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జూడో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా పట్టణంలోని ఏవీఆర్ పాఠశాల నిలిచింది. స్థానిక జ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈ నెల 26, 27వ తేదీల్లో అనంతపురం జోనల్ లెవల్ చాంపియన్‌షిప్ జూడో పోటీలు నిర్వహించారు. ఇందులో 200మంది దాకా విద్యార్థులు పాల్గొన్నారు. ఏవీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 7 గోల్డ్ మెడల్స్ 2 సిల్వర్ మెడల్స్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలవడం పట్ల ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో అనంతపురం ఆర్డీటీ స్టేడియం లో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

కళ్యాణదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని కోటవీధిలో శనివారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. డిసెంబరు 1న ఆదివారం కావడంతో ఒక్కరోజు ముందే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి

రాయదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గం పరిసరాలలో విద్యుత్ గాలిమర్లు, గ్రీన్ ఎనర్జీతో పాటు మెగా ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని స్టీల్‌ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షుడు బీఎం నాదల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బొమ్మనహాళ్ మండలంలో పర్యటించనుండడంతో రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే, నాయకులు కలిసి చర్చించాలన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

సుబ్బరాయసాగర్ పరిశీలన

పుట్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్‌ను హెచ్చెల్సీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, డీఈ చంద్రశేఖర్ సాగర్ వద్దకు వచ్చి డ్యాం నీటిమట్టంను తనిఖీచేశారు. అనంతరం మండల నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి రైతులతో కలిసి అధికారులతో మాట్లాడారు. మండలంలోని మూడు చెరువులతో పాటు బొప్పేపల్లి చెరువుకు హెచ్చెల్సీ నీటితో నింపాలని కోరారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి సమస్య వస్తోందన్నారు. చెరువులకు నీరు వదిలితే తప్ప పరిష్కారం కాదని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు చెన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామచంద్రనాయుడు, పలువురు రైతులు ఉన్నారు.

అధిక రుసుం వసూలు చేయరాదు

పామిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు దారుల నుంచి అధిక రుసుం వసూలు చేయకూడదని తహసీల్దార్ శ్రీధరమూర్తి సూచించారు. పట్టణంలోని పలు మీ సేవ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ మీ సేవ కేంద్రంలోని దరఖాస్తుదారులతో మాట్లాడారు. అవసరమైనంత రుసుంను మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా అధికరుసుం వసూలు చేస్తే మీ సేవ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో భాగ్యమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

గుత్తి నంవబరు29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4,5,6వ తేదీలలో రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలకు సంబంధించి గుత్తిలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్‌ఎంప్లాయిస్, సంఘ్ కర్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి. గుత్తి రైల్వేలో మొత్తం 1860 ఓటర్లు ఉండగా మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ పోలింగ్ బూత్‌లో 563, కమ్యూనిటీ హాల్‌లో 628, ఏడీఎన్ కార్యాలయం బూత్‌లో 669 ఓట్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకూ పోలింగ్ నిర్వహిణకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

9 గ్రామాలకు కలుషిత నీరే దిక్కు

- నాలుగు ఫిల్టర్ బెడ్‌లు శిథిలం
- దీంతో ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీటిని ఫిల్టర్ చేయకుండా సరఫరా చేస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ద్వారా మండలంలోని 9 గ్రామాలకు సరఫరా అయ్యే తాగు నీరు కలుషితమై వస్తున్నాయి. జీబీసీ నీటిని సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లోకి పంపింగ్ చేసి రోజూ ఆయా గ్రామాలకు తాగు నీరు సరఫరా చేస్తారు. ట్యాంక్‌లోని నీటిని ఫిల్టర్ చేసి 9 గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ ఏ ఫిల్టర్ బెడ్ కూడా పని చేయడం లేదు. నాలుగు ఫిల్టర్ బెడ్‌లు ఉన్నా అన్నీ శిథిలమయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు కలుషిత నీరే దిక్కయింది. ఒకటో ఫిల్టర్ బెడ్‌లో కంకర ఇసుక తొలగించి వదిలేశారు. రెండో ఫిల్టర్ బెడ్ మాత్రం అరాకొర పని చేస్తోంది. దానిలోకే నీటిని వదిలి ఫిల్టర్ చేసి 9 గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఫిల్టర్ బెడ్ 50శాతం కూడా పని చేయడం లేదు. ఇందులోకి కప్పలు లాంటివి పడి మృతి చెంది కుళ్లిపోతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. రోజు ఇలాంటి కలుషిత నీటినే 9 గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కలుషిత నీరు తాగటం వల్ల వ్యాదుల భారిన పడుతున్నామంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మూడు, నాలుగవ ఫిల్టర్ బెడ్లు కూడా పూర్తిగా శిథిలమై పని చేయడం లేదు. 2019 ముందు టీడీపీ ప్రభుత్వంలో ఆర్ కొట్టాల గ్రామానికి పైప్‌లైన్ పనులు చేయగా కొంత నిధులు మిగిలి ఉంటే.. వాటితో ఓ ఫిల్టర్ బెడ్‌ను మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేసేవారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఫిల్టర్ బెడ్‌లను పట్టించుకునే వారే కరువయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అయినా ఈ ఫిల్టర్ బెడ్‌ల పరిస్థితి మారుతుందేమో అనుకున్న మండల ప్రజలకు నిరాశే మిగిలింది. రోజూ కలుషిత నీరు తాగే దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతులు చేయించి మంచి నీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.


పూర్తిగా శిథిలమైన మూడో ఫిల్టర్ బెడ్


అరకొరగా పని చేస్తున్న రెండో ఫిల్టర్ బెడ్‌లో నీటిని నింపిన అధికారులు


(ఇన్‌సెట్లో) ఫిల్టర్ బెడ్ నీటిలో మృతి చెందిన కప్ప

కలుషిత నీరు వస్తోంది ..



విడపనకల్లులో ఎస్ఎస్ ట్యాంక్ ఉన్నా మాకు మంచి నీరు రావటం లేదు. కలుషిత నీరే వస్తోంది. సాయంత్రం మంచి నీటిని పట్టి కుండలో ఉంచితే ఉదయానికి వండ్రు మొత్తం కిందకు చేరి ఉంటోంది. ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. కనీసం ఫిల్టర్ కూడా చేయ కుండా నీటిని అలాగే సరఫరా చేస్తున్నారు. వాటిని తాగటం వల్ల లేని రోగాలు వస్తున్నాయి.

- సత్తార్, విడపనకల్లు

దుర్వాసన వస్తోంది



ఫిల్టర్ బెడ్‌లు పాడై చాలా రోజులు అయినా పట్టించుకునే వారు లేరు. రోజు కలుషిత నీటినే గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ బెడ్లలో కప్పలు చనిపోయినా, పాములు చనిపాయినా ఎవ్వరూ పట్టించుకోరు. దుర్వాసన వస్తున్న నీటినే పంపింగ్ చేసి తాగటానికి వదులు తున్నారు.

- రాము, విడపనకల్లు

ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేయించాలి



వేల కుటుంబాలు తాగే నీటిలో కప్పలు పడి చనిపోతే కూడా అధికారులు పట్టించుకోరు. సిబ్బంది ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు. అధికారులు ఫిల్టర్ బెడ్‌లు దుర్వాసన వస్తున్నా పట్టించుకోరు. వెంటనే ఫిల్టర్ బెడ్డును క్లీన్ చేసి గ్రామాలకు మంచి నీటిని అందివ్వాలి. పని చేయని ఫిల్టర్ బెడ్‌లను రిపేరు చేయించి నాలుగు ఫిల్టర్ బెడ్‌లు పని చేసేలా చర్యలు చేపట్టాలి.

- వీవీ రమణారెడ్డి, మాజీ ఎంపీపీ, విడపనకల్లు

త్వరలోనే ఫిల్టర్ బెడ్లు నిర్మిస్తాం

నాలుగు ఫిల్టర్ బెడ్లలో ఒక్కటి మాత్రం కొద్దిగా పని చేస్తోంది. దాని ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నాము. దుర్వాసన వస్తున్న ఫిల్టర్ బెడ్‌ను బ్లీచింగ్ వేయించి శుభ్రపరిచి మంచి నీటిని అందిస్తాము. కొత్త ఫిల్టర్ బెడ్‌లు నిర్మాణానికి రూ. 5 కోట్లకు ప్రతి పాదనలు పంపాము. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టి 9 గ్రామాలకు మంచి నీటిని అందిస్తాము.

- ముజామిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విడపనకల్లు

విద్యకు పెద్ద పీట: విప్ కాలవ


ఉర్దూ హైస్కూల్లో అదనపు భవనాలను ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వమే విద్యకు పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ హైస్కూల్లో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ పోస్టులను భర్తీ చేసి పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన ఉపాధ్యాయులను అందించిందన్నారు. అలాగే ఇటీవల కూటమి సర్కార్ 16 వేల పైచిలుకు డీస్సీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని గుర్తు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రహంతుల్లా, టీడీపీ నాయకులు ఆనంద్‌రాజ్, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, చంద్రశేఖర్‌గుప్తా, కురుబ నాగరాజు, ఎంపీటీసీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

రాయదుర్గంరూరల్: మండలంలోని డీ.కొండాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ యాదవ్‌కు మంజూరైన సీఎం సహాయనిధికి సంబంధించిన చెక్కును విప్ కాలవ శ్రీనివాసులు అందించారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన రూ. 1,45,318 ల చెక్కును లబ్ధిదారుడు వెంకటేష్ యాదవ్ కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, టీడీపీ నాయకుడు రామ్మూర్తి ఉన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం


దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

రాయదుర్గం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపం లో వెలసిన మద్దానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం కార్తీ క దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1008 జగద్గురు ఉజ్జయిని పీఠాధిపతి శివచార్యస్వామీజీ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆలయంలోని మద్దానేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రజలు భక్తిని అలవర్చుకొని జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

మొక్కలు నాటించిన జేసీపీఆర్


రోడ్డుకు మధ్యలో మొక్కలు నాటిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్ధిబాషా దర్గా నుంచి కర్ణాటక బ్యాంకు వరకు రోడ్డుమధ్యలోని డివైడర్‌లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణం పచ్చదనంతో పరిశుభ్రతగా ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో కళకళలాడుతూ ఉండాలని తెలిపారు. పట్టణంలో పచ్చదనం, పరిశుభ్రతకే ప్రాముఖ్యత ఇస్తామన్నారు. ఎవరైనా అపరిశుభ్రంగా ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సంజీవపురం పవన్, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

డీ.హీరేహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు బొమ్మనహాళ్ మండలంలో పర్యటించనున్నారని, కనుక బొమ్మనహాళ్, డీ. హీరేహాళ్ మండలాల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేసి వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌తో కలిసి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సమీపంలోని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన ఉందని, కనుక డీ.హీరేహాళ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్ట్రాంగ్ రూమును ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లో అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అన్ని చెరువులకు నీరందించాలి : కాంగ్రెస్

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరివ్వాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నాటి మాజీ మంత్రి రఘువీరారెడ్డి కృష్ణా జలాలను జీడిపల్లి రిజర్వాయర్ వరకు తీసు కొచ్చారని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా చెరువులను కృష్ణా జలాలతో నింపాలనే ఉద్దేశంతోనే జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణాజలాలను తీసుకొచ్చారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని చెరువులకు నీరందించాలన్నారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్, నాయకులు దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలుపై ఆందోళన

గుంతకల్లు: పట్టణంలోని నర్సింగ్ హోంలలో వైద్యులు ఇష్టానుసారంగా ఫీజులు వసూలుచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తొలుత ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. నాయకులు తిమ్మారెడ్డి, మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల అధిక ఫీజులను నియంత్రించాలని, అలాగే వైద్య సేవల ధర పట్టికను ప్రదర్శించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గుల్‌ఫరోష్ జిలాన్, శ్రీనివాస రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అస్వస్థత

యల్లనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సింహాద్రిపురం నుంచి తాడిపత్రికి వచ్చే ఆర్టీసీ బస్సులో డ్రైవర్ వెంకటేష్ అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం 6గంటల సమయంలో బస్సు సింహాద్రిపురం నుంచి బస్సు యల్లనూరుకు చేరుకొనే సమయంలో తల తిరుగుతున్నట్లు డ్రైవర్ గమనించాడు. వెంటనే బస్సును పక్కకు ఆపి విషయం ప్రయాణికులకు తెలిపాడు. గతంలో ఇతడికి బైపాస్‌సర్జరీ జరిగింది. స్థానికులు ప్రయాణికులను మరో బస్సులో తాడిపత్రికి పంపించివేశారు.

నేమకల్లులో ఎమ్మెల్యేలు, కలెక్టర్ పర్యటన


నేమకల్లులో పర్యటిస్తున్న ఎమ్మెల్యేలు

బొమ్మనహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పింఛన్ పంపిణీ చేసేందుకు మండలంలోని నేమకల్లు గ్రామానికి సీఎం చంద్రబాబు శనివారం వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్, శింగనమల, మడకశిర, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్ర శుక్రవారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. ముందుగా సీఎం పర్యటించే ప్రదేశాలను పరిశీలించారు. హెలీకాప్టర్ ల్యాండింగ్ అయ్యే మైదానాన్ని, సభావేదికను, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. హనుమాన్ ఆలయంలో చంద్రబాబు దర్శన సమయంలో ఏర్పాట్ల గురించి అర్చకులతోనూ, దేవాదాయశాఖ అధికారులతోనూ చర్చించారు.